సాక్షి
అనంతపురం
శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



టన్ను చీనీ రూ.15 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.40
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.23 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.4°/22.3°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ నాగమణి

శింగనమల: పుట్టిన బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ పీడీ నాగమణి అన్నారు. గురువారం తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శింగనమలలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ చేపట్టి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ నాగమణి మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి 6 నెలల వరకు తల్లి పాలు ఇవ్వాలన్నారు. ఆ తరువాత తల్లి పాలతో పాటు పోషకాహారం అందించాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఆగస్టు 12న నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీడీపీఓ లలితమ్మ, సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్లకు ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీబీవీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం ముగిసింది. తొమ్మిది జిల్లాల పరిధిలోని కేజీబీవీ హిందీ, ఉర్దూ టీచర్లకు బుక్కరాయసముద్రం సమీపంలోని శ్రీ భారతి డీఎడ్ కళాశాలలో ఈ నెల 3 నుంచి శిక్షణ ఇస్తున్నారు. గురువారం ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలను బాగా అర్థం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. కేజీబీవీల్లో చదువుకుంటున్న అనాథ, పేద ఆడబిడ్డలను సొంత పిల్లలుగా చూడాలని కోరారు. అడ్మిషన్లు పెంచడానికి కూడా కృషి చేయాలన్నారు. జీసీడీఓ కవిత మాట్లాడుతూ శిక్షణలో అనంతపురం, శ్రీ సత్యసాయి, నెల్లూరు, వైఎస్సార్, కర్నూలు నంద్యాల, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి 192 మంది హిందీ, ఉర్దూ టీచర్లు హాజరయ్యారన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్లను సన్మానించారు.

వెరిఫికేషన్‌కు రాలేదు.. మీ పెన్షన్ నిలిపివేస్తున్నాం

- కనికరం లేకుండా అంధుల పింఛన్లు ఆపివేసిన కూటమి సర్కారు




తమ బాధ చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వంలో పేదలను కష్టాలు వెంటాడుతున్నాయి. వెరిఫికేషన్‌కు హాజరవ్వలేదనే కారణంగా అంధులకు పింఛను నిలిపివేసిన ఘటన కుందుర్పి మండలం మలయనూరులో చోటు చేసుకుంది. ఈ క్రమంలో తమ గోడు కలెక్టర్‌కు చెప్పుకునేందుకు గురువారం బాధిత అంధులు సంకప్ప, ఆంజనేయులు, లక్ష్మమ్మ, మల్లేష్, చెన్నక్క, మహితలు కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే ఉన్నతాధికారులు అందుబాటులో లేకపోవడంతో నిరాశగా వెనుతిరిగారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 17 మందికి పింఛను నిలిపివేశారన్నారు. పునఃపరిశీలనకు కోసం ఈ ఏడాది ఫిబ్రవరి 25న అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి రావాలని నోటీసు ఇచ్చారన్నారు. అయితే వెళ్లాల్సిన పనిలేదంటూ సచివాలయ ఉద్యోగి గంగాధర్ చెప్పడంతో తాము మిన్నకుండిపోయామన్నారు. తీరా చూస్తే ఈనెల పింఛను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ డబ్బే ఆసరా అని, అది కూడా నిలిచిపోతే తాము ఎలా బతకాలని వాపోయారు.

కమీషన్ల వల.. విలవిల

కాంట్రాక్టర్లకు 'గుడ్డు'కాలం

- మార్చి నుంచి నయాపైసా చెల్లించని సర్కారు
- బిల్లులు రాకున్నా కమీషన్ ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యేల పట్టు
- అల్లాడిపోతున్న కాంట్రాక్టర్లు
- ఇప్పటికే కోడిగుడ్ల రవాణా పనులు మొత్తం ఎమ్మెల్యేల అనుచరులకే



బిల్లులతో సంబంధం లేదు. కష్టాలు పడుతున్నా పట్టడం లేదు. కమీషన్లు ముట్టజెప్పాకే మాటలు. లేదంటే కష్టాలే. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ సెంటర్లకు గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ల పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రజాప్రతినిధుల కమీషన్ల వలలో చిక్కుకుని కాంట్రాక్టర్లు అల్లాడిపోతున్నారు.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రజాప్రతినిధుల దెబ్బకు చిన్న చిన్న సివిల్ కాంట్రాక్టర్లు, బిల్డర్లే కాదు అంగన్‌వాడీలకు కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లు సైతం విలవిలలాడుతున్నారు. 'కోడి ముందా..గుడ్డు ముందా' అనే చిక్కు ప్రశ్నను మరపిస్తూ 'గుడ్డు కాదు.. దుడ్డే ముందు' అన్న విధంగా పరిస్థితి తయారైంది. 'మీకు బిల్లులు ఎప్పుడైనా రానీ.. మాకు కమీషన్ మాత్రం ముందే ఇవ్వాల్సిందే' అంటూ పట్టుబడుతుండడంతో కొన్ని నియోజకవర్గాల్లో కాంట్రాక్టర్లు ఎమ్మెల్యేలు అడిగినంత సమర్పించుకుంటున్న పరిస్థితి.

రవాణా పనులు తమ్ముళ్లకే..

గతంలో కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లే అంగన్‌వాడీలకు వాటిని రవాణా చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని నియోజకవర్గాల్లో కోడిగుడ్ల రవాణా పనులను ఎమ్మెల్యే చెప్పిన వారికి ఇచ్చారు. రవాణాకు సంబంధించిన చెల్లింపులు కాంట్రాక్టరు చేస్తారు. కాంట్రాక్టర్‌కు సమయానికి బిల్లులు వచ్చినా రాకపోయినా 'తమ్ముళ్ల'కు మాత్రం రవాణా ఛార్జీలు ఇవ్వాల్సిందే. లేదంటే ఎమ్మెల్యే నుంచి ఫోన్ వస్తుంది. ఒక్కోసారి రవాణా సమయంలో కోడిగుడ్లు దెబ్బతిన్నా కాంట్రాక్టరే ఆ భారం మోయాల్సి వస్తోంది.

ఆరు మాసాలుగా బిల్లుల్లేవ్..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరు మాసాలుగా కోడిగుడ్ల సరఫరాకు సంబంధించి బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాలో నెలకు 50 లక్షల నుంచి 60 లక్షల గుడ్లు సరఫరా అవుతున్నాయి. ప్రస్తుత రేట్ల ప్రకారం ఒక్కో కోడిగుడ్డు రూ.6 పైనే పలుకుతోంది. ఈ లెక్కన నెలకు రూ.3.50 కోట్ల వరకూ బిల్లు అవుతుంది. అయితే, రెండు జిల్లాల్లో అంగన్‌వాడీలకు సరఫరా చేసే గుడ్లకు పైసా బిల్లు చేయకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. కొందరు ఎమ్మెల్యేలు తమ కమీషన్లు ఏడాది ముందే లాగేసుకున్నారు. ఇప్పుడేమో కాంట్రాక్టర్లకు బిల్లులు రావడం లేదు. దీంతో ఏం చేయాలో దిక్కుతెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

అంతా ఆయన ఇష్టం..

కదిరి నియోజకవర్గంలో కోడిగుడ్ల సరఫరా కు సంబంధించి ప్రత్యేక రాజ్యం నడుస్తోంది. ఇక్కడ గుడ్లు సరఫరా చేయాల్సిన కాంట్రాక్టర్‌కు స్థానిక ప్రజాప్రతినిధి చుక్కలు చూపుతున్నారు. తనకే కాంట్రాక్టు ఇవ్వాలని భయపెట్టడంతో కాంట్రాక్టర్ చేసేదిలేక వదిలేశారు. అంతకుముందు కాంట్రాక్టుకు సంబంధించిన డిపాజిట్ డబ్బు కాంట్రాక్టరే బ్యాంకులో చెల్లించినా చిల్లిగవ్వ ఇవ్వలేదు. దీంతో గుడ్ల కొనుగోలు, రవాణా మొత్తం ప్రజాప్రతినిధి చేతుల్లో జరుగుతోంది.దీంతోఅక్కడ గుడ్లు చిన్నవా, పెద్దవా అని అడిగే సాహసం చేసేవారు లేరు.

అనంతపురం జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు	2,302
శ్రీ సత్యసాయి జిల్లాలో అంగన్‌వాడీ సెంటర్లు	2,824
నెలకు అవసరమయ్యే కోడిగుడ్లు	50-60 లక్షలు
నెలకు సగటున కోడిగుడ్ల బిల్లు	రూ. 3.50 కోట్లు
ఆరునెలల బకాయిలు	రూ. 21 కోట్లు

'సమగ్ర'లో మరో వికెట్ ఔట్

- సీనియర్ అసిస్టెంట్ హాజీవలి సరెండర్

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష కార్యాలయంలో మరో వికెట్ పడింది. రెండు రోజుల క్రితం సూపరింటెండెంట్ఇక్బాల్‌ను సరెండర్ చేయగా... గురువారం సీనియర్ అసిస్టెంట్ హాజీవలిని సరెండర్ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సమగ్ర శిక్ష ఉద్యోగి ఫారెన్ సర్వీస్‌లో మూడేళ్లకు మించి పని చేయడానికి వీలు లేదు. ఒకవేళ ఐదేళ్ల వరకు కొనసాగాలంటే తప్పనిసరిగా రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ నుంచి అనుమతి ఉత్తర్వులు వెలువడాలి. హాజీవలి ఫారెన్ సర్వీస్ ఇటీవలే మూడేళ్లు పూర్తయింది. విధుల పొడిగింపునకు ఎలాంటి ఫైలూ పెట్టలేదు. ఈ కారణంగానే ఆయనను డీఈఓకు సరెండర్ చేస్తూ సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా... హాజీవలి వ్యవహారంపై కొందరు ఎంఈఓలు, హెచ్ఎంలు అధికారులకు ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ఇటీవల ఓ విషయంలో తాడిపత్రి ప్రాంతానికి చెందిన ఓ హెచ్ఎం పట్ల హాజీవలి దురుసుగా మాట్లాడినట్లు సమాచారం. దీంతో పాటు మరికొన్ని విషయాల్లో పలువురు ఎంఈఓలు, హెచ్ఎంలు ఫిర్యాదులు చేశారు. గతంలో ఈయనపై క్రమశిక్షణ చర్యలూ తీసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారాలను సీరియస్‌గా పరిగణించిన ఏపీసీ, ఎలాగూ ఆయనకు మూడేళ్ల సర్వీస్ పూర్తి కావడంతో సరెండర్ చేశారు.

పలు రైళ్లకు అదనపు బోగీలు

గుంతకల్లు: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా గుంతకల్లు డివిజన్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం–ధర్మవరం (17215/16) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 10,11వ తేదీల్లో 2టైర్ ఏసీ బోగీ, తిరుపతి–హుబ్లీ (57401/02), తిరుపతి–గుంతకల్లు (57403/04) ప్యాసింజర్ రైళ్లకు 13,14 తేదీల్లో రెండు స్లీపర్ బోగీలను అటాచ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా తిరుపతి–కదిరిదేవరపల్లి (57405/06) ప్యాసింజర్ రైళ్లకు ఈ నెల 15,16వ తేదీల్లో రెండు స్లీపర్ బోగీలను అదనంగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హామీలిచ్చి ఉరితాళ్లు బిగిస్తారా?

- కూటమి ప్రభుత్వంపై చేనేతల మండిపాటు



ఉరితాళ్లు తగిలించుకుని నిరసన తెలుపుతున్న నేత కార్మికులు

అనంతపురం అర్బన్: ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా నేత కార్మికులకు ఉరితాళ్లు బిగిస్తారా అంటూ చేనేత సంఘం నాయకులు మండిపడ్డారు. ప్రతి చేనేత కుటుంబానికి తక్షణం రూ.36 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. హామీలు అమలు చేయాలంటూ ఏపీ చేనేత సంఘం ఆధ్వర్యంలో నాయకులు, నేత కార్మికులు గురువారం స్థానిక కృష్ణకళామందిర్ నుంచి క్లాక్‌టవర్ వద్ద ఉన్న చేనేత శాఖ ఏడీ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ నేత కార్మికులు మెడకు ఉరితాళ్లు తగిలించుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరాములు, గోవిందు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా చేనేత కార్మికులకు చేసిందేమీ లేదన్నారు. చేనేతలను ఉద్ధరిస్తున్నట్లుగా జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రభుత్వం జరపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బడ్జెట్‌లో చేనేత సంక్షేమానికి రూ.1,000 కోట్లు కేటాయిస్తామని చెప్పి విస్మరించారన్నారు. ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కుటుంబాలకు రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పినా అమలు చేయలేదన్నారు. గిట్టుబాటు ధరలు కల్పించి వలసలు, ఆత్మహత్యలు నివారించాలన్నారు. కార్మికులు నేసిన చీరలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించుకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి లింగమయ్య, చేనేత సంఘం నాయకులు పురుషోత్తం, చింతా వెంకటరమణ, చింతా పురుషోత్తం, శేఖర్, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై రాజకీయ కక్ష సాధింపులా?

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మండిపాటు



పూలే విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, పార్టీ నేతలు

అనంతపురం టవర్‌క్లాక్: రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేక బీసీలపై టీడీపీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మండిపడ్డారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న జ్యోతి బాపూలే విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజమ్మ మాట్లాడుతూ పులివెందులలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ బీసీ నాయకులపై దాడులకు పాల్పడడం అమానుషమన్నారు. చంద్రబాబుకు బీసీలంటే చిన్న చూపన్నారు. బీసీలు జడ్జిలుగా ఉండకూడదని, బీసీల తోక కట్ చేస్తామని గతంలో ఆయన హేళన చేశారన్నారు. బీసీలపై ఇలాగే దౌర్జన్యాలు కొనసాగిస్తామంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. ఎన్నికైన అభ్యర్థి మరణిస్తే ఆ స్థానంలో బాధిత కుటుంబ సభ్యులు పోటీలో ఉంటారని, అలాంటి ఎన్నికల్లో సాధారణంగా ఇతర పార్టీల వారు పోటీ చేయరన్నారు. కానీ, సంప్రదాయాన్ని కాలరాస్తూ టీడీపీ అభ్యర్థిని బరిలో దింపారన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలి కానీ ప్రచారం నిర్వహించేందుకు వెళ్లిన వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం అన్యాయమన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బీసీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఎన్ని అరాచకాలు చేసినా పులివెందులలో గెలిచేది వైఎస్సార్ సీపీనే అన్నారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్ మీసాల రంగన్న, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, పార్టీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశ్వర్థ నాయక్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు లక్ష్మన్న, కార్పొరేటర్లు సుమతి, సైపుల్లా బేగ్, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి కాగజ్ ఘర్ రిజ్వాన్, నాయకులు అనిల్ కుమార్ గౌడ్, శ్రీనివాసులు, రాంభూపాల్‌రెడ్డి, రామకృష్ణ, రామచంద్ర, జావిద్, నకీబ్, నవీన్ కుమార్, రామ్మూర్తి, చింతకుంట మధు, కేఎం బాషా, రాధా యాదవ్, భారతి, హరీష్ కుమార్ యాదవ్, శ్రీదేవి, వినీత్, జగదీష్, శ్రీనివాసులు, గోగుల పుల్లయ్య, వెన్నం శివారెడ్డి, జానీ, శేఖర్, మహేష్, రఫి పాల్గొన్నారు.

అహుడా లే అవుట్లలో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: అహుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న లే అవుట్లలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ వర్మ ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎన్‌టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లో ఎంఐజీ లే అవుట్లను అహుడా ద్వారా చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఎంఐజీ లే అవుట్‌లో ఇప్పటి వరకు కేటాయించని ప్లాట్లను వేలం విధానంలో విక్రయించేందుకు మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ఒకే కుటుంబంలోని వారు ఎందరైనా ప్లాట్లు కొనేందుకు వెసులుబాటు కల్పించారన్నారు. అనంతపురం, రాప్తాడు, ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని లే అవుట్లలో పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. గుంతకల్లు లే అవుట్‌లో, అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి, రాయదుర్గం,కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో వాణిజ్య, మల్టీప్లెక్స్ కాంప్లెక్స్‌లు, కన్వెన్షన్ హాల్ అభివృద్ధి పనులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అహుడా కార్యదర్శి జి.రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఈఈ దుష్యంత్, అధికారులు హరీష్, రేవంత్, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఏం జరుగుతోంది?

- ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆరా..
- సమగ్ర నివేదిక ఇవ్వాలని అసిస్టెంట్ కలెక్టర్‌కు ఆదేశం



అక్యూట్ మెడికల్ కేర్‌లో రోగితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్

అనంతపురం మెడికల్: రాష్ట్రంలోనే ఏ జిల్లాలో లేని విధంగా అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వైద్య ప్రమాణాలు దారుణంగా దిగజారాయి. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సొంత ఇలాకాలోని పెద్దాస్పత్రిలోనే దుస్థితి నెలకొనడం నిత్యం చర్చనీయాంశమవుతోంది. ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యంతో అమాయక రోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల ఆస్పత్రిలో స్ట్రెచర్ అందుబాటులో లేక మధు నాయక్ (23) అనే యువకుడు మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. గత నెలలో ఆర్థో వార్డులో వైద్యుల నిర్లక్ష్యంతో 22 ఏళ్ల రాజేష్ మరణం కలకలం రేపింది. సూపరింటెండెంట్ సొంత ఆస్పత్రి అయిన మేడా నర్సింగ్ హోంలో అడ్మిషన్ పొంది జీజీహెచ్‌లో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా రాజేష్ ప్రాణాలు కోల్పోయిన విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.దీనికితోడు వైద్యులు సమయ పాలన పాటించకపోవడం, స్టాఫ్‌నర్సులకు విధుల కేటాయింపుల్లో నర్సింగ్ సూపరింటెండెంట్ బాధ్యతారాహిత్యం, రోగులను సకాలంలో గమ్యస్థానాలకు చేర్చలేని స్థితిలో సిబ్బంది ఉండడం, ఓపీల్లో వైద్యులు విధులకు డుమ్మా కొట్టడం, కాలిన గాయాల వారికి కేటాయించిన వార్డును ఈఎన్‌టీకి కేటాయించడం తదితర విషయాలపై 'సాక్షి'లో ఇటీవల వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ క్రమంలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ స్పందించారు. అసలు ఆస్పత్రిలో ఏం జరుగుతోందంటూ ఆరా తీశారు. ఆస్పత్రిని తనిఖీ చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్‌ను ఆదేశించారు. దీంతో గురువారం అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సర్వజనాస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. పలు వార్డులను పరిశీలించారు. అక్యూట్ మెడికల్ కేర్, ఐసీయూల్లో ఏసీలు పూర్తిగా పని చేయడం లేదని తెలుసుకున్నారు. ఆస్పత్రిలో రోగులకందుతున్న సేవల్లో నాణ్యతా ప్రమాణాలు ఏమాత్రం లేవని గుర్తించినట్లు సమాచారం.కాగా, సాధారణ రోజుల్లో మధ్యాహ్నం 2 గంటలకే ఇళ్లకు పరుగులు తీసే వైద్యులు అసిస్టెంట్ కలెక్టర్ వస్తున్నారని తెలిసి ఆస్పత్రిలోనే ఉండడం గమనార్హం. మధ్యాహ్నం ఓపీ సమయంలోనూ పలు విభాగాల్లో పీజీ వైద్యులు ఉండడం కనిపించింది.

పచ్చ గద్దల కబ్జాపర్వం

- ప్రజా ప్రతినిధి కనుసన్నల్లో రెచ్చిపోతున్న ప్రైవేటు సైన్యం
- తాజాగా ఓ మైనార్టీ కుటుంబానికి చెందిన స్థలం అక్రమ రిజిస్ట్రేషన్

అనంతపురం క్రైం: అనంతపురంలో 'పచ్చ' గద్దల కబ్జాపర్వం ఆగడం లేదు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధి సారథ్యంలో ప్రైవేటు సైన్యం సాగిస్తున్న అకృత్యాలతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. 'పచ్చ' ముఠాకు పోలీసు యంత్రాంగం అండగా నిలుస్తుండడంతో బాధితులు కుమిలిపోతున్నారు. తాజాగా మైనార్టీ కుటుంబానికి చెందిన, అప్పటికే మార్ట్‌గేజ్ చేసిన స్థలాన్ని సైతం వదలకుండా అక్రమంగా తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్న వైనం కలకలం రేపుతోంది. వివరాలు.. అనంతపురంలోని సాయినగర్ 6వ క్రాస్‌లో మైనార్టీ కుటుంబానికి ఆప్టికల్ షాపు ఉంది. 2024లో ఈ స్థలాన్ని ప్రదీప్ అనే వ్యక్తి నుంచి వారు కొనుగోలు చేశారు. అనంతరం బ్యాంకులో మార్ట్‌గేజ్ చేయించారు. ఇటీవల అదే స్థలాన్ని మరొకరి పేరుపై రిజిస్ట్రేషన్ చేసి ఉండడం గుర్తించిన బాధితులు రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి నేరుగా డీఐజీకి ఫిర్యాదు చేశారు. కానీ, డీఐజీ మాత్రం 'పోలీసు కేసు పెట్టండి.. ఇక్కడ ఫిర్యాదు చేస్తే ఉపయోగం ఉండదు' అని చెప్పడంతో గురువారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసేందుకు బాధితురాలు సుమయ వచ్చారు. తమకు తెలియకుండా టీడీపీకి చెందిన కొంత మంది మరొకరి పేరున స్థలం రిజిస్ట్రేషన్ చేయించారని విలేకరులతో వాపోయారు. రిజిస్ట్రార్ రమణరావుకు ఫిర్యాదు చేస్తే ఎమ్మెల్యే బంధువుల ఒత్తిడి చాలా ఉందని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఖాళీ జాగా కనిపిస్తే పాగానే..

అనంతపురంలో ప్రజా ప్రతినిధి సారథ్యంలోని ప్రైవేటు సైన్యం యథేచ్ఛగా భూ కబ్జాలకు పాల్పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వారం రోజుల క్రితం అనంతపురం నగర శివారు 210 సర్వే నంబరులోని ఏడెకరాల భూమిలో ప్రజాప్రతినిధికి అత్యంత సన్నిహితులైన కొంత మంది కంచె వేశారు. రూ.కోట్లు విలువైన భూమిని కాజేయాలని ముఠా పక్కాగా ప్రణాళిక సైతం రూపొందించడం కలకలం రేపింది. ఇటీవల అనంతపురం రూరల్ పరిధి కక్కలపల్లి గ్రామ పొలంలోని సర్వే నంబరు 242 భూమిలోకి 'పచ్చ' రౌడీలు బలవంతంగా ప్రవేశించేందుకు యత్నించగా యజమానులు అడ్డుకున్నారు. అయితే, కబ్జారాయుళ్లు సదరు భూమి యజమాని వెంకటేశ్వరప్రసాద్‌తో పాటు అతని కుమారుడు ప్రణీత్ సాయిపై దాడి చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేక పోయింది. అలాగే, ఇదే గ్రామ పొలంలోని సర్వేనంబరు 144–2ఏ, 2బీలో విజయలక్ష్మి అనే మహిళతో పాటు మరి కొంత మందికి చెందిన ఇళ్ల స్థలాలకు సరిహద్దుగా ఏర్పాటు చేసుకున్న గోడలను కూల్చేసి, బోరు బావులను ధ్వంసం చేశారు. నగరంలోని శారదా నగర్‌కు చెందిన 242 సర్వే నంబరులోని మూడున్నర సెంట్ల స్థలంలోకి అక్రమంగా చొరబడాలని చూశారు. ఈ క్రమంలో ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నాయి. ఇలా నగరంలో కనిపించిన ప్రతి ఖాళీ జాగాలోనూ పాగా వేస్తుండడంతో ప్రజలు భయకంపితులవుతున్నారు. పోలీసులు సైతం పచ్చ మూకకే వత్తాసు పలుకుతుండడంతో అల్లాడిపోతున్నారు.



బాధితురాలు సుమయ

క్లుప్తంగా

ఎమ్మెల్సీపై దాడి హేయం

• ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ రౌడీ రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ధ్వజమెత్తారు. ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలపై దాడులకు తెగబడడం దుర్మార్గమంటూ గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. బరితెగించి దాడులు చేస్తున్న టీడీపీ మూకలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

మత్తులో వాహనం నడిపితే కఠిన చర్యలు : ఎస్పీ

అనంతపురం: మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పి.జగదీష్‌ హెచ్చరించారు. బుధవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో 53 డ్రంకన్‌ డ్రైవ్‌తో పాటు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 93 మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఈ నెల 10వ తేదీ వరకూ డ్రంకన్‌ డ్రైవ్‌పై స్పెషల్‌ డ్రైవ్‌ ఉంటుందన్నారు. 11 నుంచి 17వ తేదీ వరకూ అతి వేగంగా వెళ్లే వాహనాలపై, 18 నుంచి 24వ తేదీ వరకు హెల్మెట్‌ డ్రైవ్‌, 25 నుంచి 31 వరకు బ్లాక్‌స్పాట్‌ గుర్తింపు డ్రైవ్‌ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

13న రామగిరి ఎంపీపీ ఎన్నిక

రామగిరి: మరోసారి రామగిరి ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్‌ విడుదలైంది. ఈనెల 13న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం అధికారి సంజీవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన జీఓ మేరకు ఆరోజు ఉదయం 10 గంటలకు జరిగే ఎన్నికలో సభ్యులు పాల్గొనాలన్నారు. గత డిసెంబర్‌ నెలలో అప్పటి ఎంపీపీ మీనుగ నాగమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. ఇప్పటికే మూడుమార్లు ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. రామగిరి మండలంలో మొత్తం 10 ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. తొమ్మిది స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించింది. కేవలం ఒక్క ఎంపీటీసీ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే.

ఉద్యోగులకు అందని వైద్య సేవలు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ విరమణ పొందినవారు.. వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులకు నగదు రహిత వైద్యం అందించడానికి రూపొందించిన ఏపీఈహెచ్‌ఎస్‌ సేవలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రతి నెలా క్రమం తప్పకుండా ప్రీమియం డబ్బు చెల్లిస్తున్నా.. వైద్య సేవలు అందించేందుకు నెట్‌వర్క్‌ ఆస్పత్రుల నుంచి విముఖత వ్యక్తమవుతోంది. దీంతో సకాలంలో వైద్య సేవలు అందక ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగుల వాటాకు సమానంగా సర్కారు చెల్లింపులు లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.



జిల్లాలో	
ఉద్యోగులు	27,982
పెన్షనర్లు	16,403
మొత్తం	44,385
ప్రతి నెలా చెల్లిస్తున్న ఈహెచ్‌ఎస్‌ ప్రీమియం	
కేటగిరీ 1	రూ.225
కేటగిరీ 2	రూ.300

- ఏపీఈహెచ్‌ఎస్‌కు 'కూటమి' బ్రేక్‌
- మూడు నెలలుగా నిలిచిన వైద్య, ఆరోగ్య సేవలు
- ఈహెచ్‌ఎస్‌ ఉన్నా నిష్ప్రయోజనం
- అత్యవసర చికిత్సలందక ఆందోళనలో ఉద్యోగ, పెన్షనర్లు
- ఈ పరిస్థితి ఎన్నడూ లేదంటున్న సంఘాల నాయకులు

అనంతపురం అర్బన్‌: ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు కూటమి నాయకులు చాలా హామీలు ఇచ్చారు. ఆశల్లో ముంచెత్తారు. వారి మాటలను ఉద్యోగులు, పెన్షనర్లు నమ్మారు. తీరా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏడాది దాటినా.. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. దీంతో అప్పటి వరకూ వారి కళ్లను కప్పి ఉంచిన ఆశల పొర తొలిగిపోయింది. కూటమి నాయకుల మాటలను నమ్మి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే మూలిగే నక్క మీద తాడిపండు పడిన చందంగా వారి ఆవేదన మరింత పెంచేలా ఎంప్లాయిస్‌ హెల్త్‌ స్కీమ్‌ (ఈహెచ్‌ఎస్‌) సేవలు మూడు నెలలుగా నిలిచిపోయాయి. దీంతో ఉద్యోగులు, పెన్షనర్లకు అత్యవసర వైద్యం అందడం లేదు.

ప్రతి నెలా తమ వాటా చెల్లిస్తున్నా...

ఏపీ ఈహెచ్‌ఎస్‌ సేవలు అందిపుచ్చుకునేందుకు ప్రతి నెలా తమ వాటా కింద సంస్థకు ఉద్యోగులు, పెన్షనర్లు ప్రీమియం చెల్లిస్తున్నారు. బేసిక్‌ పే ఆధారంగా ఉద్యోగులు ప్రతి నెలా చెల్లించే ప్రీమియం ఏడాదికి రూ.200 కోట్లు చొప్పున ప్రభుత్వ ఖజానాకు చేరుతుంది. అలాగే పెన్షనర్లు కూడా చెల్లిస్తున్నారు. ఈ మొత్తానికి సమానంగా సర్కార్‌ కూడా జమ చేయాల్సి ఉంది. ఈహెచ్‌ఎస్‌ కింద వారు లేదా వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించాలి. అయితే మూడు నెలలుగా ఈహెచ్‌ఎస్‌ ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్యం అందడం లేదు. ఈహెచ్‌ఎస్‌ ద్వారా అందించిన వైద్యసేవలకు సంబంధించి బకాయిలను నెట్‌వర్క్‌ ఆస్పత్రులకు ప్రభుత్వం చెల్లించని కారణంగా సేవలు నిలిపి వేసినట్లు విశ్వసనీయ సమాచారం.

21 ఏళ్లుగా రూ.2 లక్షలే..

ఈహెచ్‌ఎస్‌ ద్వారా గరిష్టంగా రూ.2 లక్షల వరకే వైద్యం అందిస్తారు. 2004 నుంచి అంటే 21 ఏళ్లుగా ఇదే పరిస్థితి. గతంలో ఉద్యోగ, పెన్షనర్లు తమ వాటా కింద రూ.90 ఉంచి రూ.120 వరకు చెల్లించేవారు. అప్పట్లో రూ.2 లక్షల వరకూ ఉచిత వైద్య సేవలు అందేవి. ప్రస్తుతం ఈ మొత్తాన్ని రూ.225 నుంచి రూ.300కు పెంచారు. అయితే రూ.2 లక్షల వరకూ వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ విషయాన్ని ఆక్షేపిస్తూ పలుమార్లు ఉద్యోగులు, పెన్షనర్లు ఈహెచ్‌ఎస్‌ సేవలను రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్‌ చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా అందించే అత్యవసర వైద్య సేవల పరిమితిని రూ.25 లక్షలకు పెంచడం చాలా సంతోషమే అయినా.. ప్రతి నెలా డబ్బు చెల్లిస్తున్న తమకు మాత్రం వైద్య ఖర్చు పరిమితి పెంచకపోవడం ఎంత వరకు సమంజసమంటూ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రశ్నిస్తున్నారు.

ఎన్నడూ చూడలేదు



మూడు నెలలుగా ఈహెచ్‌ఎస్‌ ద్వారా వైద్య సేవలు అందడం లేదు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదు. ఒకవైపు ప్రతి నెలా ఈహెచ్‌ఎస్‌కు మా వాటా కింద నిర్దేశిత డబ్బును జమ చేస్తూ ఉన్నాం. ఈ డబ్బును నెట్‌వర్క్‌ ఆస్పత్రులకు ప్రభుత్వం చెల్లించకపోవడంతో వైద్య సేవలను నిలిపివేశారు. అత్యవసర వైద్యసేవలు కూడా అందడం లేదు. ఈహెచ్‌ఎస్‌ సేవలను పునరుద్ధరించి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పరిమితి పెంచాలి. – శీల జయరామప్ప, జిల్లా కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం

ప్రభుత్వం తీరు బాగలేదు



ఉద్యోగుల విషయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు బాగలేదు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదు. ఉద్యోగులకు అందాల్సిన బకాయిలు చెల్లించలేదు. డీఏలు ఇవ్వలేదు. పీఆర్‌సీ వేయలేదు. ఐఆర్‌ ప్రకటించలేదు. అవి చాలదన్నట్లు ఇప్పుడు ఈహెచ్‌ఎస్‌ ద్వారా వైద్యం అందని పరిస్థితి కల్పించారు. ఉద్యోగులు మమ్మల్ని నిలదీస్తుంటే నాయకులుగా సమాధానం చెప్పలేకపోతున్నాం. – దివాకర్‌రావు, జిల్లా చైర్మన్‌, ఏపీజేఏసీ అమరావతి

చేతి నుంచి డబ్బు కట్టాల్సి వస్తోంది



ఉద్యోగులను, పెన్షనర్లను ప్రభుత్వం అన్ని విధాల ఇబ్బందికి గురిచేస్తోంది. ఇచ్చిన ఏ ఒక్క హామీని అధికారంలోకి వచ్చిన తరువాత నెరవేర్చలేదు. ఈహెచ్‌ఎస్‌ ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకపోవడంతో వైద్య సేవలు అందకుండా పోయాయి. చివరకు అత్యవసర వైద్య సేవలకు చేతి నుంచి డబ్బు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, పెన్షనర్లు ఈహెచ్‌ఎస్‌ కింద దాదాపు రూ.200 కోట్లను ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. అయినా ఈ పరిస్థితిని ప్రభుత్వం కల్పించడం బాధాకరం. – చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీఎన్‌జీఓ

గురుకుల కళాశాలలో అగ్నిప్రమాదం

• సిలిండర్‌ మారుస్తుండగా ఎగిసిపడిన మంటలు • వంట మనిషికి గాయాలు

అనంతపురం ఎడ్యుకేషన్‌: అనంతపురం రూరల్‌ మండలం కురుగుంటలోని అంబేడ్కర్‌ గురుకుల కళాశాలలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విషయాన్ని బయటకు పొక్కకుండా అధికారులు దాచిపెట్టే ప్రయత్నం చేయడంతో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో వంటశాలలో వంట చేస్తున్న సమయంలో తక్కువ మంట వెలుగుతుండడంతో సిలిండర్‌ను మార్చేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో నిండు గ్యాస్‌ సిలిండర్‌ సీల్‌ను ఓపెన్‌ చేసి రెగ్యులేటర్‌ అమరుస్తున్న సమయంలో పెద్ద శబ్దంతో మంటలు ఎగిసి పడ్డాయి. మంటల వేడికి సిలిండర్‌ను మారుస్తున్న వంటమనిషి లక్ష్మీదేవి ముఖం, చేతులకు గాయాలయ్యాయి. గ్యాస్‌ సిలిండర్‌ పేలిందేమోనన్న విద్యార్థినులు, ఉద్యోగులు భయపడ్డారు. వెంటనే లక్ష్మీదేవిని సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న సాంఘిక సంక్షేమ అంబేడ్కర్‌ గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మి హుటాహుటిన కురుగుంటకు వెళ్లి ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి సర్వజన ఆస్పత్రికి చేరుకుని వంటమనిషి లక్ష్మీదేవిని పరామర్శించారు. సిలిండర్‌ పేలలేదని గ్యాస్‌ అయిపోయిన సిలిండర్‌ స్థానంలో మరో సిలిండర్‌ ఏర్పాటు చేసే సమయంలో మంటలు ఎగిసిపడ్డాయని జయలక్ష్మి వివరించారు. ఆమెకు నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యం : ఏఐఎస్‌ఎఫ్‌

కురుగుంట అంబేడ్కర్‌ గురుకుల కళాశాలలో గ్యాస్‌ ప్రమాదం ముమ్మాటికి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే జరిగిందని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.కుళ్లాయిస్వామి ఆరోపించారు.జ వంటమనిషికి అవగాహన లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని, గ్యాస్‌ సిలిండర్లు మార్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంలో అంబేడ్కర్‌ గురుకుల పాఠశాలల అధికారులు అలసత్వం ప్రదర్శించారన్నారు. ఈ ఘటనకు సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్‌ బాధ్యత వహించాలని డిమాండ్‌ చేశారు.

అన్ని రంగాల్లో బీసీలు రాణించాలి

• 10వ జాతీయ ఓబీసీ మహాసభలో వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్‌



రమేష్‌గౌడ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌, ఓబీసీ జాతీయ అధ్యక్షుడు బాబన్‌ రావు

అనంతపురం కార్పొరేషన్‌: విద్య, ఉపాధి, రాజకీయ తదితర అన్ని రంగాల్లో బీసీలు ప్రగతి సాధించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా బీసీలందరూ ఏకమై అడుగు ముందుకు వేయాలని వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్‌ పిలుపునిచ్చారు. గురువారం గోవాలో 10వ జాతీయ ఓబీసీ మహాసభ జరిగింది. కార్యక్రమానికి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్‌సావంత్‌, ఓబీసీ మహాసంఘ్‌ జాతీయ అధ్యక్షుడు బాబన్‌రావు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రమేష్‌గౌడ్‌ మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయం నుంచి పరిశ్రమలు, విద్యారంగం నుంచి సేవా రంగం వరకూ బీసీలు దేశాభివృద్ధి కోసం పోరాడుతున్నారన్నారు. ప్రస్తుత రోజుల్లో సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, రాజకీయ ప్రాతినిధ్యం జనాభా ప్రాతిపదికన సాధించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రోత్సాహకాలు అందించాలన్నారు. అనంతరం బీసీలకందిస్తున్న సేవలకు గానూ రమేష్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

పరిశ్రమల ఏర్పాటుకు భూములివ్వం

• ఆర్డీఓకు స్పష్టం చేసిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కేశవనాయుడు

రాప్తాడు: అన్నం పెట్టే భూములను పరిశ్రమల కోసం ఇవ్వలేమని ఆర్డీఓ కేశవనాయుడుకు రైతులు స్పష్టం చేశారు. తమను కాదని భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటే పొలాల్లోనే ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. వివరాలు.. రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లి సమీపంలో బొమ్మేపర్తి, గొందిరెడ్డిపల్లి రెవెన్యూ పొలాల్లో ఎంఎస్‌ఎంఈ పార్క్‌ పేరిట పరిశ్రమల స్థాపనకు 114 ఎకరాలను అధికారులు కేటాయించారు. ఈ నేపథ్యంలో అక్కడి పంట పొలాలను స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జూన్‌ 20న ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులు భూములను సర్వే చేయడానికి వెళితే రైతులు అడ్డుకున్నారు. దీంతో విషయాన్ని అప్పట్లో కలెక్టర్‌కు తహసీల్దార్‌ విజయకుమారి నివేదించారు. అదే సమయంలో ఏపీఐఐసీ అధికారులు కూడా తమకు రాప్తాడు మండలంలో కేటాయించిన భూములను అప్పగించాలని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలంటూ కలెక్టర్‌ ఆదేశించడంతో ఆర్డీఓ కేశవనాయుడు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి రెండు గ్రామాల పరిధిలోని సర్వే నంబర్లు 307, 308, 309, 310, 311, 312లోని 27 మంది రైతులకు సంబంధించిన 114 ఎకరాల భూమిని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. 60 ఏళ్ల క్రితం డీ పట్టాలు, పట్టాదారు పాసు పుస్తకాలు పొంది, గుట్టలు, రాళ్లు తొలగించి సాగు భూమిగా మార్చుకోవడానికి ఒక్కో రైతుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఖర్చు అయిందని రైతులు వివరించారు. కొందరు ఈ భూముల్లో షెడ్లు ఏర్పాటు చేసుకుని పాడి పోషణ, గొర్రెల పెంపకం చేపట్టారన్నారు. ఈ భూములు తప్ప మరో జీవనోపాధి తమకు లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తు సమాచారం ఇవ్వకుండా పరిశ్రమల పేరుతో భూములను బలవంతంగా లాక్కోవడం దారుణమన్నారు. భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటే పొలాల్లోనే ఆత్మహత్య చేసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. గొందిరెడ్డిపల్లి, బొమ్మేపర్తి రెవెన్యూ గ్రామాల్లోని 108 ఎకరాలను ఏపీఐఐసీకి గతంలో కేటాయించినట్లు గుర్తు చేశారు. రైతులెవ్వరూ పభూములు ఇచ్చేందుకు సుముఖంగా లేరని తెలిపారు. ఇదే విషయాన్ని కలెక్టర్‌కు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి



కావేలమ్మ (ఫైల్‌)

కళ్యాణదుర్గం రూరల్‌: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట ప్రాంతానికి చెందిన రామాంజనేయులు భార్య కావేలమ్మ విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. గురువారం ఉదయం దుస్తులు ఉతికి ఆరేసే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌ వైర్‌ తగిలి షాక్‌కు గురై, అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్ట్‌

తాడిపత్రి టౌన్‌: తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారంటూ తాడిపత్రి మండలం సజ్జలదిన్నెకు చెందిన టీడీపీ నేత కేశవరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు ఐదుగురిని అరెస్ట్‌ చేసినట్లు తాడిపత్రి రూరల్‌ సీఐ శివగంగాధరరెడ్డి, ఎస్‌ఐ ధరణిబాబు తెలిపారు. వివరాలను గురువారం వెల్లడించారు. పట్టుబడిన వారిలో సజ్జలదిన్నెకు చెందిన ఉప్పర రాజేష్‌, మంగల సాయికుమార్‌, పసలూరి ఆంజనేయులు, మేకల చిన్న ఓబులేసు, తాడిపత్రిలోని పోరాట కాలనీకి చెందిన ఎం.రాజు ఉన్నారు. గురువారం ఉదయం వీరిని సజ్జలదిన్నెలోని వేణుగోపాలరెడ్డి బండల ఫ్యాక్టరీ వద్ద అరెస్ట్‌ చేసి, 3 కత్తులు, కట్టెలు స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో వీఆర్‌ఓ అరెస్ట్‌



వీఆర్‌ఓ వలిని అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

గుంతకల్లు టౌన్‌: ఏడు నెలల గర్భిణిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో వీఆర్‌ఓను అరెస్ట్‌ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు గుంతకల్లు వన్‌టౌన్‌ సీఐ మనోహర్‌ తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. గుంతకల్లులోని సోఫియా స్ట్రీట్‌కు చెందిన షేక్‌ షమీమ్‌ భానూ తన కుమారుడి పేరును రేషన్‌ కార్డులో నమోదు చేయించుకునేందుకు సచివాలయానికి వెళ్లిన సమయంలో వీఆర్‌ఓ మహమ్మద్‌ వలి పరిచయమయ్యాడు. అనంతరం ఆమెకు మాయమాటలు చెప్పి రెండో పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె ఏడు నెలల గర్భిణి. షమీమ్‌కు సంబంధించిన బంగారాన్ని ఆమె పేరిట బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.2 లక్షల రుణం తీసుకున్న వలి ఆ డబ్బును తన స్వప్రయోజనాలకు వాడుకున్నాడు. అనంతరం ఆమె బాగోగులు పట్టించుకోలేదు. భర్త చేసిన మోసంపై గత నెల 14న గుంతకల్లు వన్‌టౌన్‌ పీఎస్‌లో ఆమె ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో తనపై కేసు నమోదు చేయించినందుకు కక్ష కట్టి ఆమెను వేధింపులకు గురిచేస్తూ 'ఎక్కడైనా పడి చావు... నువ్వు చచ్చిపోతే నాకు మనశ్శాంతిగా ఉంటుంది' అని నిర్దయగా మాట్లాడాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన షమీమ్‌ బుధవారం విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి షేక్‌ పీర్‌ బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వీఆర్‌ఓ వలిని అరెస్ట్‌ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

డాక్టర్‌ రమణ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు

• క్రిమినల్‌ కేసు నమోదుకు ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ సిఫారసు

అనంతపురం మెడికల్‌: గర్భిణి మృతి అంశానికి సంబంధించి ప్రభుత్వ సర్వజనాస్పత్రి సర్జరీ విభాగం అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ రమణ నాయక్‌కు చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. ఈ నెల 3న చెదళ్ల గ్రామానికి చెందిన గర్భిణికి రాధమ్మ(29)కు శ్రీనివాస్‌నగర్‌లోని శ్రీకృప ఆస్పత్రిలో డాక్టర్‌ రమణనాయక్‌ సర్జరీ చేస్తుండగా ఆపరేషన్‌ టేబుల్‌పైనే మృతి చెందిన విషయం తెలిసిందే. గతంలో సీజ్‌ చేసిన ఆస్పత్రిని గుట్టుచప్పుడుగా తెరిచి శస్త్రచికిత్సలు చేయడంతో పాటు పీసీ పీఎన్‌డీటీ యాక్ట్‌ అతిక్రమణ, తదితర తప్పిదాలు చేసినట్లు డాక్టర్‌ రమణ నాయక్‌పై అభియోగాలు మోపుతూ ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ డాక్టర్‌ శివ్‌నారాయణ్‌ శర్మకు డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఈ భ్రమరాంబ దేవి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌... డాక్టర్‌ రమణనాయక్‌పై క్రిమినల్‌ కేసు నమోదుకు సిఫారసు చేశారు. కాగా, కేసు నమోదుకు మూడో పట్టణ పీఎస్‌ సీఐ శాంతిలాల్‌ నిరాకరించడంతో ఈ నెల 6న ఎస్పీని కలిసేందుకు ఆరోగ్యశాఖ డెమో సిబ్బంది, లీగల్‌ అడ్వైజర్‌ వెళ్లారు. ఆ సమయంలో ఎస్పీ లేకపోవడంతో ఇన్‌చార్జ్‌ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా డాక్టర్‌ రమణ నాయక్‌ సెలవులో వెళ్లినట్లు తెల్సింది. అలాగే గర్భిణి మృతికి సంబంధించి సమగ్ర దర్యాప్తునకు ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ ఆత్మారాం ఏర్పాటు చేసినట్లు సమాచారం.

జిల్లాకు చేరిన ఎరువులు

అనంతపురం అగ్రికల్చర్‌: పీపీఎల్‌ కంపెనీ నుంచి 707 మెట్రిక్‌ టన్నులు ఎరువులు జిల్లాకు సరఫరా అయినట్లు రేక్‌ ఆఫీసర్‌, ఏడీఏ అల్తాఫ్‌ అలీఖాన్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో 214 మెట్రిక్‌ టన్నులు యూరియా, 10-26-26 రకం 244 మెట్రిక్‌ టన్నులు, 28-28-0 రకం కాంప్లెక్స్‌ ఎరువులు 244 మెట్రిక్‌ టన్నులు చేరాయన్నారు. జాయింట్‌ కలెక్టర్‌ ఆదేశాల మేరకు 115 మెట్రిక్‌ టన్నులు యూరియా మార్క్‌ఫెడ్‌కు, మిగతా 99 మెట్రిక్‌ టన్నులు ప్రైవేట్‌ డీలర్లకు సరఫరా చేసినట్లు వెల్లడించారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు.. మేం చేస్తున్నాం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి పొలంలో స్తంభాలు నాటిన అధికారులు
- అడ్డుకోబోతే జేసీ ప్రభాకరరెడ్డి పేరు చెప్పిన వైనం



విద్యుత్‌ స్తంభాల ఏర్పాటును అడ్డుకుంటున్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్‌: అధికారం అడ్డుపెట్టుకుని తాడిపత్రి మున్సిపల్‌ చైర్మన్‌ జేసీ ప్రభాకర్‌రెడ్డి సాగిస్తున్న దౌర్జన్యాలు తారస్థాయికి చేరుకున్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదుల రమేష్‌రెడ్డి మండిపడ్డారు. తాడిపత్రి సమీపంలోని నందలపాడు వద్ద సర్వే నంబర్‌ 166లోని తన పొలంలో గురువారం విద్యుత్‌ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలుసుకున్న ఆయన అక్కడకు వెళ్లి అధికారులను అడ్డుకున్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. దీంతో 'జేసీ ప్రభాకర్‌రెడ్డి సార్‌ చెప్పారు.. మేము చేస్తున్నాం' అంటూ వారు బదులు ఇవ్వడంతో రమేష్‌రెడ్డి వెంటనే ట్రాన్స్‌కో ఏడీ రాజారాంతో ఫోన్‌లో మాట్లాడారు. తనకు కొంత సమయం కావాలంటూ ఏడీ బదులిస్తూ ఫోన్‌ పెట్టేయడంతో... వైఎస్సార్‌సీపీ నాయకుల ఆస్తుల విధ్వంసానికి జేసీ ప్రభాకర్‌రెడ్డి తెరలేపారంటూ మీడియా ఎదుట వాపోయారు.

సీఐ జయనాయక్‌ వేధిస్తున్నారు

• ఎస్‌హెచ్‌ఆర్‌సీకి బాధితుడి ఫిర్యాదు

రాయదుర్గం: స్థానిక అర్బన్‌ సీఐ జయనాయక్‌ వేధిస్తున్నాడంటూ రాష్ట్ర మానవ హక్కుల సంఘానికి (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) వైఎస్సార్‌సీపీ నాయకుడు బోర్‌వెల్‌ నాగిరెడ్డి రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. వివరాలను గురువారం సామాజిక మాధ్యమాల ద్వారా ఆయన పంచుకున్నారు. సీఐ వేధింపులపై గతంలోనూ జిల్లా ఎస్పీ, డీఐజీ, డీజీపీ, చీఫ్‌ సెక్రటరీకి రాత పూర్వకంగా ఫిర్యాదులు చేసినా.. ఎలాంటి చర్యలూ చేపట్టలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తనపై అక్రమంగా కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సీఐ జయనాయక్‌ వేధింపులు తాళలేక రాష్ట్రం విడిచి కర్ణాటకలోని బళ్లారిలో తలదాచుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐ వేధింపుల నుంచి రక్షణ కోరుతూ రాష్ట్ర మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించినట్లు వివరించారు. తన ఫిర్యాదును ఎస్‌ఆర్‌ నంబర్‌ హెచ్‌ఆర్‌సీ 1249/2025గా నమోదు చేసి విచారణకు స్వీకరించారని తెలిపారు. తనకు న్యాయం చేకూరుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్‌

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో జరిగిన చోరీ కేసును 24 గంటల్లోనే ఛేదించి నిందితులను అరెస్ట్‌ చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీకేఎస్‌లోని చేపల కాలనీలో నివాముంటున్న పాముల తిక్కప్ప బుధవారం ఇంటికి తాళం వేసుకుని కూరగాయల వ్యాపారం కోసం మార్కెట్‌కు వెళ్లాడు. విషయాన్ని గుర్తించిన దుండగులు అదే రోజు రాత్రి ఇంట్లోకి చొరబడి రూ.3.30 లక్షల నగదు, 6 తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. గురువారం ఉదయం 7 గంటలకు ఇంటికి చేరుకున్న తిక్కప్ప.. చోరీ విషయాన్ని గుర్తించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో ముసలమ్మ కట్ట వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న గాజుల ఇంద్రసేనారెడ్డి, గాజుల శశికుమార్‌రెడ్డి అలియాస్‌ బద్రీని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో చోరీ విషయాన్ని అంగీకరించారు. వీరి నుంచి చోరీ సొత్తుతో పాటు నగదునూ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్సుల నిర్వహణలో లోపాలు తలెత్తరాదు

• ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్‌



బస్సు ప్లేట్లను పరిశీలిస్తున్న ఈడీ చంద్రశేఖర్‌

అనంతపురం క్రైం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలైతే ప్రయాణికుల సంఖ్య పరిమితికి మించి ఉంటుందని, ఈ క్రమంలో బస్సుల నిర్వహణలో లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ డిపో కార్మికులకు ఆ సంస్థ ఈడీ చంద్రశేఖర్‌ ఆదేశించారు. గురువారం అనంతపురానికి విచ్చేసిన ఆయన ఆర్‌ఎం శ్రీలక్ష్మి, డిపో మేనేజరు నాగభూపాల్‌తో కలసి డిపో, బస్టాండును పరిశీలించారు. టికెట్‌ మిషన్‌ వినియోగంపై కండక్టర్లకు పలు సూచనలు చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఆర్‌ఎం మాట్లాడుతూ.. ఇప్పటి రవకూ తమకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు అందలేదని స్పష్టం చేశారు.

క్లస్టర్‌ స్కూళ్లకు చేరిన ప్రశ్నపత్రాలు

అనంతపురం ఎడ్యుకేషన్‌: ఈ నెల 11 నుంచి 1–10 తరగతుల విద్యార్థులకు ప్రారంభమయ్యే ఫార్మెటివ్‌ అసెస్‌మెంట్‌ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు ఇప్పటికే మండల విద్యాశాఖ కార్యాలయాలకు చేరాయి. అక్కడి నుంచి 1–5 తరగతులకు సంబంధించిన ప్రశ్నపత్రాలు గురువారం క్లస్టర్‌ స్కూళ్లకు సరఫరా చేశారు. అలాగే 6–10 తరగతుల ప్రశ్నపత్రాలు ఎమ్మార్సీల్లో భద్రపరిచారు. పరీక్షలు రోజూ రెండు పూటలా నిర్వహించనున్నారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందే మాత్రమే ఆయా పాఠశాలలకు ప్రశ్నపత్రాలు బండిళ్లను అందజేస్తారు.

క్లుప్తంగా

జీతాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి?



ఎంపీడీఓ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న సత్యసాయి కార్మికులు

ఆత్మకూరు: నాలుగు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జీతాలు ఇవ్వకుంటే మా కుటుంబాలను ఎలా పోషించుకోవాలని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 11వ తేదీలోపు జీతాలు ఇవ్వకుంటే పెద్ద ఎత్తున సమ్మె చేపడుతామని స్పష్టం చేశారు. గురువారం ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మ, ఎస్‌ఐ లక్ష్మణరావుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో దాదాపు 850 గ్రామాల్లో 540 మంది వరకు నీటి సరఫరా కార్మికులుగా పని చేస్తున్నామన్నారు. జీతాలు ఇవ్వకుంటే పంపు హౌస్‌ల దగ్గర మోటార్లు నిలిపివేసి సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నీటి సరఫరా కార్మికులు శ్రీరాములు, నీలకంఠ, శివ, ఓబన్న, హరిప్రసాద్, రమేష్‌రెడ్డి, ఇమామ్, దివాకర్ పాల్గొన్నారు.

పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు



హెడ్ కానిస్టేబుల్ రమేష్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం: అనారోగ్యంతో మృతి చెందిన కంబదూరు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ మృతదేహానికి అనంతపురంలో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం అనంతపురంలో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం ఆరో రోడ్డులోని శ్మశాన వాటికలో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠ, ఎస్‌ఐ లోకేష్, కంబదూరు ఏఎస్‌ఐ ఓబుళపతి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు, మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు. కాగా, రమేష్ మృతిపై ఎస్పీ జగదీష్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. తక్షణ సాయం కింద రూ.లక్షను రమేష్ భార్య రామలక్ష్మికి అందజేశారు.

ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



జేఎన్‌టీయూ(ఏ) వీసీ సుదర్శనరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం: ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపుదల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కూటమి సర్కార్ ఇంజినీరింగ్ విద్యార్థుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. రూ.10 వేల నుంచి రూ.45 వేలకు ఫీజులు పెంచడం జరిగిందన్నారు. మౌలిక వసతుల కల్పనలో విఫలమైన ప్రభుత్వం విద్యార్థుల ఫీజులు పెంచడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఇన్‌చార్జ్ గణేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్, దివాకర్, హితేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం

అనంతపురం: రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్, రతన్ టాటా ప్రాంతీయ ఇన్నోవేషన్ హబ్ డైరెక్టర్ శివ్ నారాయణ శర్మ అన్నారు. గురువారం జేఎన్‌టీయూ అనంతపురంలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ ప్రాంతీయ హబ్ కేంద్రంలో బోర్డు సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక బాధ్యత కింద పారిశ్రామిక సంస్థల ద్వారా నిధులను సమకూర్చడం జరుగుతుందన్నారు. సామాజిక వ్యాపారం, గ్రామీణ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఈ కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, సోలార్ ఎనర్జీ ఇండస్ట్రీలలో ఎక్కువగా యువత ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉంటాయన్నారు. సమావేశంలో అడిషనల్ బోర్డు డైరెక్టర్లు కనకారావు, పీకే మురుగున్, జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, స్కిల్‌డెవలప్‌మెంట్ నోడల్ అధికారి ప్రతాప్ రెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, కియా ప్రతినిధి డాక్టర్ సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు



పూల మార్కెట్ కిటకిట



టెంకాయలు, ఇతర పూజా సామగ్రి కొనుగోళ్లు

వరాల లక్ష్మీ రావమ్మా



అరటి పిలకలు కొనుగోలు చేస్తున్న మహిళ

శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి మొదట వచ్చే శుక్రవారం రోజు వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తారు. ఎనిమిది విధాల సకల సౌభాగ్యాలనిచ్చే అష్టలక్ష్ములను మహిళలు పూజిస్తారు. వరలక్ష్మి వ్రతం కోసం జిల్లా వ్యాప్తంగా ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం, కొల్హాపూర్ మహాలక్ష్మి మందిరం తదితర చోట్ల ఏర్పాట్లు పూర్తి చేశారు. వరలక్ష్మి వ్రతం కోసం అవసరమైన పూజా సామగ్రి కొనుగోళ్లతో గురువారం టవర్‌క్లాక్ ప్రాంతం, పాతూరు మార్కెట్ కిటకిటలాడాయి. అరటి, మామిడి ఆకులు, టెంకాయలు, బంతిపూల ధరలు పెరిగిపోయాయి.

– అనంతపురం కల్చరల్/ సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



జనసంద్రంగా మారిన పాతూరు మార్కెట్

పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యమే

అనంతపురం: జిల్లాకు చెందిన పోలీసు పిల్లలను ప్రోత్సహించేందుకు ప్రతిభా పురస్కారాలు (మెరిట్ స్కాలర్‌షిప్స్) ఎస్పీ జగదీష్ తెలిపారు. పది, ఇంటర్మీడియట్, ఎంటెక్, ఎంబీఏ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ చాటిన 107 మంది పోలీసు పిల్లలకు జిల్లా పోలీసు సంక్షేమ నిధి నుంచి రూ.6,23,500 విలువైన చెక్కులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు కుటుంబాలను గౌరవించాలనే మెరిట్ స్కాలర్‌షిప్స్ అందజేస్తున్నామన్నారు. పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధ్యమే అన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో చక్కగా చదివి మంచి మార్కులు సాధించి ప్రతిభా పురస్కారాలు అందుకోవడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర రెడ్డి, సీఐలు ధరణి కిశోర్, దేవానంద్, వంశీకృష్ణ, హరినాథ్ ఆర్‌ఐలు మధు, పవన్ కుమార్, రాముడు, పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ రాష్ట్ర సభ్యుడు ఆర్‌ఎస్‌ఐ జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, లక్ష్మీనారాయణ, జీటీ సరోజ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రతిభా పురస్కారం అందజేస్తున్న ఎస్పీ జగదీష్

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

అనంతపురం అర్బన్: రాప్తాడు నియోజకవర్గం మన్నీల గ్రామంలో భోగి నాగేష్ ఇంటిని అధికార పార్టీ నాయకులు దౌర్జన్యంగా కూల్చివేశారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాల్యవంతం ఓబులేసు తెలిపారు. గురువారం ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మను కలసి ఘటనకు సంబంధించిన ఫొటోలు అందజేసి వివరాలు వెల్లడించారు. నాగేష్ అతని సోదరులు ప్రస్తుతం జీవనాధారం కోసం కర్ణాటక వలస వెళ్లారన్నారు. ఈనెల 6వ తేదీన కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో టీడీపీకి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా జేసీబీతో ఇంటిని కూల్చివేశారని తెలిపారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం తరఫున కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. ఇల్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని కోరారు.



ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మకు వినతిపత్రం అందజేస్తున్న ఓబులేసు

భూసార పరీక్షలతో ప్రయోజనాలు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ట్రైకోడెర్మావిరిడీ అనే జీవరసాయన ఎరువు వాడకం వల్ల ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పీడీ పద్మలత, రూరల్ మండలం ఏఓ వెంకటకుమార్ తెలిపారు. గురువారం రూరల్ పరిధిలో తాటిచెర్లలో పొలంబాట, రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేరుకు సంబంధించి అన్ని రకాల తెగుళ్ల నివారణకు ట్రైకోడెర్మావిరిడీ సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. తక్కువ రేట్లతో అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇక ప్రతి మూడేళ్లకు ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని.. అందుకు అనుగుణంగా పోషక యాజమాన్యం చేపట్టాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటల పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటకు 20–20–0–13, అలాగే 10–26–26 రకం కాంప్లెక్స్ ఎరువులు ఎకరాకు ఒక బస్తా వేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. పంటల బీమా ప్రీమియం గడువు ఇంకా ఉన్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు సాగు చేసిన పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు మురళీకృష్ణ, అలేఖ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

రాప్తాడు: రైతులను ఇబ్బంది పెట్టకుండా వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ కేశవ నాయుడు ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. భూములకు సంబంధించిన జాయింట్ ఎల్‌పీఎంను తొలగించాలని గాండ్లపర్తి గ్రామానికి చెందిన పలువురు రైతులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. గాండ్లపర్తి గ్రామంలో 180 జాయింట్ ఎల్‌పీఎంలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జాయింట్ ఎల్‌పీఎంలు పెండింగ్‌లో ఉండటంతో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. ఈనెల 11 నుంచి రెవెన్యూ అధికారులు షెడ్యూల్ ప్రకారం ఒక్కొక్క రోజు ఐదు మంది రైతులను పిలిపించి వారి సమస్యను గ్రామంలోనే విచారించి వారి జాయింట్ ఎల్‌పీఎంలను విడగొట్టి రైతులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రతి సోమవారం జరిగే ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలన్నారు. మండల కేంద్రాల్లోనే సమస్యలు పరిష్కారం అయితే జిల్లా కేంద్రాలకు అర్జీదారులు ఎవరూ రారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, ఆర్‌ఐ రాగే కరుణాకర్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవ నాయుడు

సంక్షిప్త సమాచారం

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

అనంతపురం రూరల్: తమ విద్యా సంస్థల్లో చదివే ప్రతి విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పీవీకేకే కళాశాల చైర్మన్ పల్లె వెంకట కృష్ణకిశోర్ అన్నారు. గురువారం పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో శ్రీసాయి రక్షా ఎంటర్‌ప్రైజెస్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పలువురు విద్యార్థులకు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల యాజమాన్య సిబ్బంది విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి పంచాయతీ పరిధిలోని జర్నలిస్ట్ కాలనీకి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. సుగాలి రామప్ప నాయక్ మేనల్లుడు సుగాలి శీను నాయక్ (20) మేనమామ ఇంట్లోనే ఉంటున్నాడు. శీను నాయక్ ఇంటర్ చదువుకున్నాడు. డిగ్రీ చదువుకోవడం ఇష్టం లేక ఖాళీగా ఉంటున్నాడు. చదువుకోవాలని చెప్పినందుకు చెప్పాపెట్టకుండా గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. రామప్ప నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేనేతను కాపాడుకుందాం

అనంతపురం: స్వాతంత్య్ర ఉద్యమంలో చేనేతల కృషి అమోఘమని జిల్లా సహకార అధికారి అరుణ కుమారి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా చేనేత, జౌళీ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. చేనేతను కాపాడుకుందాం.. సంస్కృతిని కాపాడుకుందాం అంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మి నరసింహం, చేనేత కార్మిక సంఘం నాయకులు నరసింహులు, అసిస్టెంట్ మార్కెటింగ్ ఆఫీసర్ శివప్రసాద్, జిల్లా చేనేత, జౌళీ శాఖాధికారి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

అనంతపురం: విద్యార్థి జీవితంలో క్రీడలు భాగస్వామ్యం కావాలి. క్రీడలతో మానసిక వికాసం సాధ్యమని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు పేర్కొన్నారు. గురువారం జేఎన్‌టీయూ అనంతపురంలో 16వ ఫిజికల్ డైరెక్టర్ల సమావేశాన్ని స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ ప్రొఫెసర్ టి.నారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ప్రతి ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడలు నిర్వహించడానికి అవసరమైన సాయం వర్సిటీ అందిస్తుందన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో పతకాలు దక్కించుకున్న క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

అనంతపురం కల్చరల్: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షా బంధన్ అని బ్రహ్మకుమారీల జిల్లా ఇన్‌చార్జ్ సిస్టర్ శారద అన్నారు. రాఖీ పౌర్ణిమ వేడుకలను ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సాధకులు ఘనంగా ప్రారంభించారు. సిస్టర్ శారద నేతృత్వంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, ఆర్డీఓ సురేష్ నాయుడు, డీటీసీ వీర్రాజు తదితర అధికారులతో పాటూ పలు పోలీసు స్టేషన్లలోని పోలీసు అధికారులకు రాఖీలు కట్టి పర్వదిన విశిష్టతను తెలిపారు.

నులిపురుగులను నివారిద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ దివాకర్

రాప్తాడురూరల్: ఈనెల 12, 20 తేదీల్లో జరిగే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని అనంతపురం రూరల్ మండలంలో విజయవంతం చేయాలని ఎంపీడీఓ పి.దివాకర్ పిలుపునిచ్చారు. గురువారం కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రూరల్ మండలంలో 131 అంగన్‌వాడీ కేంద్రాల్లో 7,540 చిన్నారులు ఉన్నారన్నారు. అలాగే 97 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 30,783 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. 29 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 16,861 మంది విద్యార్థులకు అందించేందుకు నులిపురుగు నివారణ మాత్రలు సరఫరా చేశామన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీ సిబ్బంది

అనంతపురం ఎడ్యుకేషన్: బిడ్డలకు ఆరోగ్యకరమైన ఆనందకరమైన జీవితాన్ని అందించేందుకు తల్లిపాలే రక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.జ్యోతి సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం అనంతపురం రూరల్ 5వ సెక్టార్ పరిధిలోని పాపంపేట, విద్యారణ్య నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ బి.జ్యోతి మాట్లాడుతూ.. నవజాత శిశువు మొదటి ఆహారమైన తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి లభిస్తుందన్నారు.

ఆత్మకూరు: పౌష్టికాహారంతో పిల్లలు, గర్భవతులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య తెలియజేశారు. గురువారం మండలంలో పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి పర్యటించారు. పిల్లలకు తల్లిపాలు తాపాలని సూచించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు.

సదాశివ కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ పరిధిలోని సదాశివ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. గురువారం అక్కంపల్లిలో నిర్వహించిన 'మీ సమస్య మా బాధ్యత' కార్యక్రమంలో కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ శాఖ కార్యదర్శి రెడ్డప్ప, కమిటీ సభ్యులు నాగభూషణ, వెంకటేశులు, మహేంద్ర, అంజి మాట్లాడారు. 14 సంవత్సరాలుగా సదాశివ కాలనీలో గుడిసెలు వేసుకొని కాపురం ఉంటున్నామన్నారు. పక్కా గృహాలు నిర్మించుకోవడానికి వీలుగా ఇంటి పట్టాలు కూడా ఇవ్వలేదని వాపోయారు. గర్భిణులు, చిన్న పిల్లలకు అంగన్వాడీ కేంద్రం లేదన్నారు. అలాగే కాలనీ నుంచి రాచానపల్లి ప్రాథమిక పాఠశాలకు వెళ్లడానికి చిన్న పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో వచ్చిన వర్షాలకు సొంత ఖర్చులతో నిర్మించుకున్న చిన్న వంతెన పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం తెచ్చుకునేందుకు సుమారుగా రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తోందన్నారు. కాలనీలోనే బియ్యం వేసేలా చూడాలని కోరారు. లేనిపక్షంలో కాలనీ ప్రజలతో కలసి మండల కార్యాలయం ముందు ధర్నా చేస్తామని స్పష్టం చేశారు.

నగల అపహరణ

లింగాల: గది అద్దెకిస్తే నగదు, నగలు అపహరించిన సంఘటన లింగాల మండలం పార్నపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. అనంతపురం జిల్లాకు చెందిన హసీనా, మాబాషా ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. తమకు ఆశ్రయం కల్పించాలని పార్నపల్లి గ్రామానికి వచ్చారు. ఆ యువతీ యువకులు అరటి కాయలు మోసే కూలీ పనులు చేస్తూ గత ఆరు మాసాలుగా జీవనం సాగిస్తున్నారు. గురువారం ఇల్లు అద్దెక్కిచిన మహిళ ఇంట్లో లేకపోవడతో ఇంటి తాళాలు పగులగొట్టారు. ఇంట్లో దాచిన రూ.1.10 లక్షల నగదు, జత బంగారు కమ్మలు, మాటీలు, కాళ్ల గొలుసులు తీసుకుని ఉడాయించారు. ఈ విషయమై ఇల్లు అద్దెకు ఇప్పించిన వ్యక్తితో పాటు పారిపోయిన హసీనా, మాబాషాలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిందీ భాషాభివృద్ధికి కృషి

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీలో ప్రాథమిక స్థాయి నుంచి హిందీ భాషను ఒక పాఠ్యాంశంగా చేర్చాలి. దేశ అధికారిక భాషను విద్యార్థులు నేర్చుకునే అవకాశం కల్పించాలని హిందీ ప్రచార్ సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్.గైబువల్లి కోరారు. గురువారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా 6–10 తరగతుల విద్యార్థులకు హిందీ పోటీ పరీక్షలకు సంబంధించి హిందీ సేవాసదన్ రూపొందించిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హిందీ భాషాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ హిందీ ప్రచార్ సభ అధ్యక్షుడు సీఎల్ రాయుడు పాల్గొన్నారు.

అక్టోబర్ 13న ఐద్వా రాష్ట్ర మహాసభలు



మహాసభ బ్రోచర్లు విడుదల చేస్తున్న ఐద్వా నాయకురాళ్లు

అనంతపురం అర్బన్: నగరంలో అక్టోబర్ 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తెలిపారు. గురువారం స్థానిక లలిత కళాపరిషత్‌లో మహాసభల బ్రోచర్లను నాయకురాళ్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి 500 మంది మహిళ ఉద్యమ నాయకులు హాజరవుతారన్నారు. మూడేళ్ల చేసిన కృషిని సమీక్షించుకుని భవిష్యత్ కర్తవ్యాలను మహాసభలో రూపొందించుకుంటామన్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా అఖిల భారత అధ్యక్ష, కార్యదర్శులు మచియందావలే, పుణ్యవతి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ అరుణ, పద్మజ, డాక్టర్లు బాలా కుమారి, ప్రసూన, సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నాయకురాళ్లు చంద్రిక, అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

రేడియో కేంద్రంలో విద్యార్థుల సందడి



వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న పదో తరగతి విద్యార్థి

రాప్తాడు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆకాశవాణి రేడియో కేంద్రం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బాలవాణి కార్యక్రమంలో భాగంగా గురువారం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అనంతపురంలోని ఆకాశవాణి రేడియో కేంద్రాన్ని సందర్శించారు. పదో తరగతి విద్యార్థి శంకర్‌నాథ్ రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించి ఆకట్టుకున్నాడు. విద్యార్థులు వివిధ దేశ భక్తి గేయాలు, నాటికలు, సంభాషణలు, ఏకపాత్రాభినయాలు చేశారు. ఆకాశవాణి బృందం విద్యార్థులను అభినందించింది. కార్యక్రమంలో ఆకాశ వాణి ట్రెక్స్ హారిక, ఆకాశవాణి సాంకేతిక సిబ్బంది, క్యాజువల్ అనౌన్సర్లు, హెచ్‌ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు లక్ష్మన్న, శ్రీహరి పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి



గణేష్ రెడ్డి (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: జ్వరంతో పాటు కామెర్లు రావడంతో ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. వివరాలు.. 'సాక్షి' దినపత్రిక ప్రకటన విభాగంలో పని చేస్తున్న భాస్కర్‌రెడ్డి బస్టాండ్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయనకు కూతురు, కుమారుడు గణేష్ రెడ్డి (23) సంతానం. ఇటీవలే కూతురు వివాహం చేశాడు. యానిమేషన్ పూర్తి చేసిన గణేష్ రెడ్డి హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో యానిమేటర్‌గా పని చేసేవాడు. ఇటీవల జ్వరం రావడంతో అనంతపురం వచ్చాడు. కామెర్లు వచ్చినట్లు తెలియడంతో కుటుంబీకులు అతన్ని బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో పరిస్థితి విషమంగా మారి గురువారం మృత్యువాత పడ్డాడు. వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

అనంతపురం సిటీ: స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రజా పరిషత్ యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎం.విజయభాస్కర్‌రెడ్డి (ఏఓ), అసోసియేట్ అధ్యక్షుడిగా ఎల్.శ్రీనివాసులు (ఎస్‌ఏ), ఉపాధ్యక్షుడిగా జి.రామకృష్ణ (జేఏ), ప్రధాన కార్యదర్శిగా బి.మురళీకృష్ణ (ఎస్‌ఏ), సంయుక్త కార్యదర్శిగా మల్లికార్జున (ఏఓ), ట్రెజరర్‌గా ఎస్.షబ్బీర్ నియాజ్ (ఏఓ), ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుకన్య (ఎస్‌ఏ)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరిషత్ యూనిట్ కౌన్సెలర్లు (కో–ఆప్షన్ ద్వారా ఎన్నికైన వారు)గా మరో ఆరుగురిని ఎన్నుకున్నారు. అంతకు ముందు సమావేశం నిర్వహించి అనేక అంశాలపై చర్చించారు.

యాత్రా రచనలు చదవాలి

అనంతపురం కల్చరల్: ఆచార వ్యవహారాలను, అలవాట్లను ప్రతిబింబించే యాత్రా రచనలు చదవడం చాలా అవసరమని వక్తలు పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో గురువారం విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిమ్మగడ్డ శేషగిరి ఆంగ్లంలో రాసిన లాటిన్ అమెరికా యాత్ర రచనను దాసరి అమరేంద్ర తెలుగు అనువాదం 'మనమెరగని లాటిన్ అమెరికా' పుస్తక పరిచయ సభ జరిగింది. కార్యక్రమంలో రాజ్‌మోహన్, డాక్టర్ ప్రగతి, జయచంద్ర, బీఎస్‌ఎన్‌ఎల్ విశ్రాంత డీఈ శంకర నారాయణ పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా Client G. Saarika D/o G. Hari గారికి అనంతపురము లోని స్టార్ రాజహంసలో 4వ అంతస్తులోని ఫ్లాట్‌ను M.Khedarnath S/o M.N.Srinivasa Setty అనే అతనికి గత ఆరు సం॥లుగా బాడుగకు ఇవ్వడం జరిగినది. సదరు అతనికి చాలా కాలము అద్దె సకాలములో చెల్లించేవాడు. గత 5 నెలలుగా ఇంటి అద్దె, Maintenance, Elc Charges కట్టలేదు. అతని ఆచూకీ కూడా తెలియలేదు. ఇంటికి తాళమువేసి కనబడకుండా Phone Switch Off చేసుకొని వున్నారు. నేను గత నెలలో ఈ విషయమై on 06-07-2025 నేను చుట్టుపక్కల వారితో విచారించి అతనికి ఒక నెలగడువు ఇచ్చి సదరు నోటీసును నా Client ఇంటి గేటుకు మరియు Apartment Notice Board కు అతికించినాను. అయినప్పటికి అతని నుండి ఎలాంటి ప్రతిస్పందన రానందున ఈ Public Notice ఇవ్వడము జరుగుతోంది. కావున నేటి నుండి 7 రోజుల లోపల సదరు M.Khedarnath గాని ఆయన చేత Authorise చేయబడిన వ్యక్తులు గాని ఎవరైనావచ్చి మాకు ఇవ్వవలసిన అద్దె వగైరా బకాయిలు చెల్లి అతని గృహోపకరణ వస్తువులు తీసుకొని వెళ్ళవలసినదిగా ఇందుమూలంగా కోరడమైనది. అట్లు రాని పక్షమున గడువు పూర్తి అయిన తరువాత మీ యొక్క గృహోపకరణములు మా స్వాధీనంలోనికి తీసుకొని వాటిని అమ్మి మా యొక్క ఇంటి అద్దె వగైరా బకాయిలు పోను ఏదైనా మొత్తము మిగిలితే దానిని మూడు నెలల పాటు మా దగ్గర వుంచుకొంటాము. అప్పుడు మీరు ఎవరైనా వస్తే మీకు ఇస్తాము. రాని పక్షమున ఏదైనా మిగిలిన మొత్తము After Sale ఏదేని దేవాలయమునకు ఇవ్వడము, అని తెలియచేయడమైనది.

L. Prabhakar Reddy
Advocate, Anantapur.